క్లుప్తంగా

చినఅమిరం గ్రామ సచివాలయం సందర్శన


సచివాలయంలో ఆన్‌లైన్ సేవలను పరిశీలిస్తున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం అర్బన్: మండలంలోని చినఅమిరంలో గ్రామ సచివాలయాన్ని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అకస్మికంగా సందర్శించారు. కొత్త రేషన్ కార్డుల జారీ, కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు, తదితర అంశాలను జేసీ పరిశీలించారు. సర్వీసులకు అప్లై చేయుటలో సాంకేతిక సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకొని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్‌వో ఎస్.సరోజ, ఏఎస్‌వో ఎం.రవి శంకర్, సీఎస్‌ఆర్‌ఐ సురేష్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, రాయలం, చినఅమిరం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, వెంప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, నాగిడిపాలెం తదితర గ్రామాల్లో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ వర్షం వల్ల చేపల చెరువుల్లో సప్ప నీరు పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేంకటేశ్వరునికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి రాజమండ్రికి చెందిన పాలడుగు ఆంజనేయులు, అన్నపూర్ణాదేవి దంపతులు 8గ్రాముల బంగారాన్ని మంగళవారం అందజేశారు. ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు ఈ విషయం వెల్లడించారు.

హనుమద్ జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం


బల్లిపాడులో అభయాంజనేయస్వామి విగ్రహం

అత్తిలి: ఈనెల 22న జరిగే హనుమద్ జయంతి ఉత్సవాలకు మండలంలోగల ఆంజనేయ స్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలు సందర్భంగా పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బల్లిపాడు గ్రామంలో గల అభయాంజనేయస్వామి విగ్రహం వద్ద హనుమద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ


సిద్ధాంతంలో సర్వేను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ గీతాబాయి

పెనుగొండ: సిద్ధాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయ్ ఆకస్మిక తనిఖీ చేశారు. మంగళవారం పీహెచ్‌సీలోని విభాగాలను సందర్శించారు. ఓపీ సేవలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గర్భిణుల జాబితాలు పరిశీలించి, సుఖ ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం ఎన్సీడీ, సీడీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రంగస్థల కళాకారులకు నిత్యావసర సరుకుల అందజేత


తణుకులో కళాకారులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

తణుకు అర్బన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వృద్ధ రంగస్థల కళాకారులకు నూతన వస్త్రాలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్థానిక అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు కళారంగంలో కళాకారుల పాత్రను కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, భారతీదేవి, నల్లజర్ల వెంకన్న, కార్యదర్శి ఎండీ స్వాలిహో, కోశాధికారి అర్జి భాస్కరరావు, సహాయ కార్యదర్శి ఎస్.రామకృష్ణారావు పాల్గొన్నారు.

సమస్యల ప్రయాణం.. నరక ప్రాయం


ఉండి రైల్వే స్టేషన్‌లో తాళాలు వేసిన మరుగుదొడ్లు


ఉండి బస్టాండ్‌లో పూడ్చి వేసిన తాగునీటి కుళాయిలు

- బస్టాండ్, రైల్వే స్టేషన్లలో మౌలిక వసతుల కరువు
- అందుబాటులో లేని తాగునీరు, మరుగుగొడ్లు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండిలో సమస్యలతో ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారు. ఎన్నో గొప్పలు చెప్పుకునే ప్రజా ప్రతినిధులు ప్రయాణికుల సాధారణ అవసరాలు కూడా తీర్చలేకపోతున్నారు. దీనిని నిర్లక్ష్యం అనుకోవాలా లేక మరొకటి అనుకోవాలో వారే తేల్చుకోవాలి. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో ఓ మంత్రి, సాధారణ ఎన్నికల్లో ఒక్కసారి తప్ప ప్రతిసారి విజయం టీడీపీ ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ ఉండే ఉద్దండమైన ఉండిలో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించలేని నియోజకవర్గంగా పేరు గాంచింది. అయినా ఉండి అభివృద్ధికి నోచుకోలేదు. కొన్నేళ్ల క్రితం పునః నిర్మాణమైన ఉండి రైల్వే స్టేషన్ నుంచి నియోజకవర్గంలోని ఉండి, కాళ్ల మండలాల్లోని పలు గ్రామాలతో పాటుగా ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఉండి రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణాలు సాగిస్తారు. విజయవాడ, రాజధాని అమరావతికి వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వైద్యం కోసం వెళ్లే రోగులతో స్టేషన్ ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతుంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు నీటి వసతి పూర్తి స్థాయిలో అందుబాటులో లేకపోవడంతో మరుగుదొడ్లకు అధికారులు తాళాలు వేశారు. అధికారులు రైల్వే స్టేషన్‌కు పూర్తి స్థాయిలో నీటి సౌకర్యం కల్పించి ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

రంగులు వేశారు.. వసతులు మరిచారు

ఉండి బస్టాండ్‌లో దశాబ్దాల నుంచి తాగునీటికి ప్రయాణికులు కటకటలాడుతూనే ఉన్నారు. ఎవరైనా దాతలు చలివేంద్రం ఏర్పాటుచేస్తే కానీ ప్రయాణికులకు తాగునీరు అందుబాటులో ఉండదు. ఇటీవల ఉండి బస్టాండ్‌ను ఆధునీకరిస్తున్నామని రాళ్లు వేశారు. రంగులు వేశారు కానీ మౌలిక సవతుల సంగతి మరిచారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొంత కాలం నుంచి మరుగుదొడ్లు పని చేస్తున్నాయి గానీ అత్యంత దుర్వాసనతో లోనికి వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆధునీకరించక ముందు బస్టాండ్‌లో కూర్చునేందుకు బెంచీలు, కుర్చీలు ఉండేవి. ఇప్పుడు వాటిని తీసిపారేశారు.

సదుపాయాలు కల్పించాలి



రైల్వే ప్రయాణం సుఖవంతంగాను, సంతోసంగాను ఉంటుంది. కానీ ఇటీవల రైల్వే అధికారుల్లో కూడా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. ముఖ్యంగా ఉండి రైల్వే స్టేషన్‌లో కుళాయిలు ఉన్నాయి కానీ నీళ్లు రావు. మరుగుదొడ్లు ఉన్నాయి కానీ ఉపయోగంలో లేవు. అధికారులు వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలి.

– దానం విద్యాసాగర్, న్యాయవాది, పాములపర్రు

ఇంత నిర్లక్ష్యమా ?



మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకే ఏమీ పట్టదన్నట్లు ఉంటే ఎలా. ప్రతి దానికి ప్రజలు ఫిర్యాదులు చేస్తే గానీ పట్టించుకోరా. రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో ప్రయాణికులకు ఏ సదుపాయాలు కావాలనే సంగతిని ప్రయాణికులు పోరాడి సాధించుకోవాలా. వాటిని కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రజా ప్రతినిధులకు లేదా. ఇది ఎంవరకు న్యాయం, ఇది ముమ్మాటికి వారి నిర్లక్ష్యమే.

– పీవీఆర్‌కే అంజనేయరాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వాంద్రం

వేసవి విజ్ఞాన శిబిరాలకు నిధుల కొరత

- భారంగా శిబిరాల నిర్వహణ
- స్పందించని అధికారులు


వేసవి విజ్ఞాన శిబిరంలో చెస్, క్యారమ్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

భీమవరం: వేసవి సెలవుల్లో విద్యార్థులో సృజనాత్మకను పెంపొందించడానికి రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలకు నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహకులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. ప్రతి ఏటా స్కూళ్లకు వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథాగా గడపకుండా ప్రభుత్వ గ్రంథాలయాల్లో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం పరిపాటి. సుమారు 40 రోజుల పాటు ప్రతి రోజూ గ్రంథాలయాల్లో విద్యార్థులు ఉదయం ఎనిమిది నుంచి మూడు గంటల పాటు పలు రకాల ఆటలు, కథలు చెప్పడం, డ్యాన్స్‌లో శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఏప్రిల్ 28వ తేది నుంచి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 74 శాఖా గ్రంథాలయాల్లో ప్రారంభమయ్యాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పలు రకాల ఆటలు, పాటలు, డ్యాన్స్ నేర్పించడమేగాక వారికి అల్పాహారం, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాల్సి ఉంది.

నిధులు లేక గ్రంథాలయాధికారుల పాట్లు

ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాల నిర్వహణకు గతంలో ప్రభుత్వం ఆయా గ్రంథాలయాల గ్రేడ్లను బట్టి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు నిధులు మంజూరు చేసేది. ఈ నిధులతో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బ్యానర్లు కట్టడం, శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్, బటర్‌మిల్క్ ప్యాకెట్ల పంపిణీ, విజేతలకు బహుమతులు అందించేవారు. అంతే కాకుండా డ్యాన్స్, చెస్, చిత్రలేఖనం, క్యారమ్స్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించేవారు. అయితే ఈ ఏడాది శిక్షణా శిబిరాలు ప్రారంభించి దాదాపు 22 రోజులు గడిచిపోయినా ఇప్పటి వరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రంథాలయాధికారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో శిక్షణా శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులకు దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్నాక్స్, బటర్‌మిల్క్ ప్యాకెట్స్ అందిస్తున్నా జూన్ 6వ తేదీతో ముగిసే శిక్షణా శిబిరంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులివ్వడానికి నిధులు ఎలా సమకూర్చుకోవాలో తెలియక మదనపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా ముగిసే విధంగా తోడ్పాటునందించాలని గ్రంథాలయాధికారులు కోరుతున్నారు.

టంగుటూరి ఆశయ సాధనకు కృషి చేయాలి


తణుకు వైఎస్సార్ పార్కు వద్ద టంగుటూరికి జోహార్లు చెబుతున్న యూత్ నాయకులు

తణుకు అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మంగళవారం తణుకులో కామేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ పార్కులో ఉన్న టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు సూరంపూడి వైభవ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని యోధుడిగా పోరాడి ఆంధ్రకేసరిగా ఘనత సాధించారని అన్నారు. నీతి నిజాయతీతో రాష్ట్ర ముఖ్యమంత్రిగా సమర్థవంతమైన పాలన అందజేసిన మహనీయుడు టంగుటూరిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరి రాజా, చేగొండి బ్రహ్మాజీ, జి.చంద్రశేఖర్, దంపనబోయిన దుర్గారావు పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ వాసవి జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారిచే జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామకృష్ణ తెలిపారు. జాబ్ మేళా గురువారం ఉదయం కళాశాలలో జరుగుతుందని, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారని వెల్లడించారు. జాబ్ మేళాలో అమరరాజా, గాయత్రీ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, అపోలో ఫార్మ, డైకిన్, రిలయన్స్, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా, అరబిందో ఫార్మా తదితర 14 కంపెనీలచే జాబ్ మేళా ఉంటుందని తెలిపారు. హాజరై విద్యార్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీలకు సంబంధించిన సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, బయోడేటా ఫొటోలతో సహా రావాలని తెలిపారు నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీఓ నంబర్ 4 విషయంలో పునరాలోచించాలి

అత్తిలి: సచివాలయ వ్యవస్థలో రేషనలైజేషన్ జీఓ నంబర్ 4 విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ అత్తిలి మండల వీఆర్వోలు మంగళవారం తహసీల్దార్ దశిక వంశీకి వినతిపత్రం అందజేశారు. నూతన విధానంతో రెండు సచివాలయాలకు కలిపి ఒక వీఆర్వోను ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల తీవ్రమైన ఒత్తిడి, పనిభారం ఉంటుందని వీఆర్వోలు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి


భీమవరం: ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు


వైఎస్సార్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నాయకులు

భీమవరం: ఉద్యోగులు, కార్మికులకు హానికరంగా ఉన్న లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు స్పష్టం చేశారు. మంగళవారం భీమవరంలో నిర్వహించిన ఆందోళనలో ఆయన మాట్లాడుతూ ఉగ్రవాద చర్యలను నిరసిస్తూ కార్మిక సంఘాలు ఈ నెల 20వ తేదిన తలపెట్టిన సమ్మెను కేంద్ర కార్మిక సంఘాలు వాయిదా వేశాయని తిరిగి జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా సమ్మె చేయడానికి నిర్ణయించినట్లు చెప్పారు. ఈ సమ్మెలో అన్ని తరగతుల ప్రజానీకం పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంజేటి శ్రీనివాస్ ఎం.ఆంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగేశ్వరరావు, కలిపిండి సత్యనారాయణ, కురిటి సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పని దినాలను కాపాడుకుందాం

ఆకివీడు: కార్మికుల పని దినాలను కాపాడుకుందామని సీఐటీయూ నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో మంగళవారం దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా కార్మికులు నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు పెంకి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో మండల కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నెల్లి సూరిబాబు, నిమ్మల శ్రీను, నక్కాని సత్యనారాయణ, రమేష్, దండు వాసురాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్


కళాశాలలో విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండోవ రోజు మంగళవారం శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటల పరీక్షలు జరిగాయి. 479 మందికిగాను 429 మంది పరీక్షలకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరిశీలికులగా విచ్చేసిన ప్రొఫెసర్ సుభాష్, టెస్ట్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు పర్యవేక్షించారు. హాల్ టిక్కెట్లును పరిశీలించారు.

శశిలో..

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఫార్మసీ, అగ్రికల్చర్ కళాశాలల్లో ప్రవేశాలకు గాను నిర్వహించే ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశ పరీక్ష రెండోవ రోజు మంగళవారం పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ ఈఏపీ సెట్ -2025 పరీక్షలు ఉదయం, సాయంత్రం వరకు జరిగాయి. 482 మందికిగాను 452 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పీడబ్ల్యూడీ అభ్యర్థులు ఎవరూ పరీక్షలు రాయలేదు. పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మొహమ్మద్ ఇస్మాయిల్ తెలిపారు. కో ఆర్డినేటర్ పి.రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

ఉరుములతో భారీ వర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మంగళవారం రాత్రి 8.30 గంటలకు ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతంగానే ఉంది. ఉదయం సమయంలో పిడుగులాంటి శబ్ధాలతో జల్లులు కురిసినప్పటికి రోజంతా చిన్నపాటి జల్లులు మినహా భారీ వర్షం కురవలేదు. అయితే రాత్రి అవ్వగానే ఒక్కసారి భారీ వర్షం పడటంతో పలు పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇంటి నుంచి బయిటకు వెళ్లిన వారు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు.

అక్రమ తూములతో పంట కాలువలకు తూట్లు

- అర కిలోమీటరుకో అక్రమ తూము
- భారీగా తోడేస్తున్న పంట నీరు
- వెంకయ్య, ఓల్డ్ వయ్యేరు, ఉండి కాలువల దుస్థితి


ఓల్డ్ వయ్యేరులో అక్రమంగా ఏర్పాటు చేసిన తూము

ఆకివీడు: అక్రమ తూములు పంట కాలువలకు తూట్లు పొడుస్తున్నాయి. గత కొన్నేళ్లుగా అక్రమ తూములతో పంట కాలువల్లోని నీటిని చెరువుల్లోకి యథేచ్ఛగా తోడేస్తున్నారు. రొయ్యలు, చేపల చెరువుల్లోని కలుషిత నీటిని పంట కాలువల్లోకి వదిలేస్తున్నారు. దీంతో వరి చేలకు ఇబ్బందిగా మారింది. మరికొన్ని చోట్ల కలుషిత నీటితో వరి సాగు కత్తి మీద సాములా మారింది. పంట కాలువలు కలుషితం కావడంతో గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లోకి నీరు నింపుకునే అవకాశం లేకుండా పోతుంది. కలుషిత నీటినే చెరువుల్లో నింపుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. ఉండి నియోజకవర్గంలోని ప్రధాన పంట కాలువలైన వెంకయ్య వయ్యేరు, ఓల్డ్ వయ్యేరు, ఉండి పంట కాలువ, గోస్తనీ-వేల్పూరు (జీఎస్‌వీ), రేలంగి చానల్ పంట కాలువలున్నాయి. వీటి నుంచి మీడియం కాలువలు ఆయా మండలాల్లోని మరికొన్ని గ్రామాలకు తాగు, సాగు నీటిని సరఫరా చేస్తున్నాయి. నియోజకవర్గంలోని 70 గ్రామాల్లో పంట కాలువలకు సుమారుగా 281కి పైగా అక్రమ తూములున్నట్లు రైతులు అంచనా వేస్తున్నారు. అక్రమ తూముల వలన రైతులకు, ప్రజలకు తీవ్ర నీటి ఎద్దడి, కలుషిత నీరు సరఫరా అవుతోంది.

పంట కాలువల వెంబడి ఆక్వా సాగు

అక్రమ తూరలతో పాటు పంట కాల్వలకు చేర్చి చేపల, రొయ్యల చెరువుల సాగు కొనసాగుతోంది. నియోజకవర్గంలోని అన్ని ప్రధాన కాలువలకు చేర్చి తవ్విన చెరువులకు సీపేజ్ బోదెలు ఏర్పాటు చేయకపోవడంతో చెరువులోని కలుషిత నీరు పంట కాలువలోకి చొచ్చుకు వస్తుంది. పంట కాలువలకు మూడు మీటర్లు వదిలి చెరువు గట్లు నిర్మించాలన్న నిబంధనను మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకుండా చెరువులను తవ్వించడంతో ఈ పరిస్థితి నెలకొంది.

ఇంటి వాడకం తూముల తొలగింపు

పంట కాలువలోకి ఏర్పాటు చేసిన ఇంటి వాడకం తూములను నీటి పారుదల శాఖ సిబ్బంది తొలగిస్తున్నారు. తూములను డమ్మీ చేయిస్తున్నారు. వాడకం నీటిని పంట కాలువలోకి వెళ్లకుండా చూడాలని హెచ్చరిస్తున్నారు.

అక్రమ తూములతో అనర్థాలు



పంట కాలువలకు చేర్చి చేపలు, రొయ్యల చెరువు గట్లు వేయడం ద్వారా సీపేజ్‌తో కాలువలు కలుషితమవుతున్నాయి. కొన్ని గ్రామాల్లో పంట కాలువల నుంచి నేరుగా బోదెలు తవ్వుకొని అక్రమ తూములు ఏర్పాటు చేశారు. వీటిని తొలగించే చర్యలు చేపట్టడం ద్వారా మంచినీటి కాలుష్య సమస్య తీరుతుంది. కాలువలో స్వచ్ఛమైన గోదావరి నీరు శివారు ప్రాంతానికి సరఫరా కావాలంటే అక్రమ తూములను తొలగించాలి.

– సైదాల సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ, చెరుకుమిల్లి, ఆకివీడు మండలం

సర్వే చేయిస్తున్నాం



పంట కాలువలకు ఏర్పాటు చేసుకున్న అనధికార తూములను సర్వే చేయిస్తున్నాం. ఇప్పటికే ఓల్డ్ వయ్యేరు, వెంకయ్య వయ్యేరు సర్వే పూర్తి కావచ్చింది. మిగిలిన పంట కాలువల్లో కూడా సర్వే వేగవంతంగా చేయిస్తున్నాం.

– ఫణి శంకర్, ఏఈ నీటిపారుదల శాఖ, ఆకివీడు, ఉండి

చైతన్యంతో బాల్య వివాహాలకు చెక్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా బాలల రక్షణ అధికారి రాజేష్

ఆకివీడు: కిశోర బాలికల చైతన్యంతో బాల్య వివాహాలకు చెక్ పెట్టవచ్చని బాలల రక్షణ జిల్లా అధికారి రాజేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో మంగళవారం మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాల్య వివాహాలు అరికట్టేందుకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బాల్య వివాహాల నిరోధక అధికారులు ఎవరనేది వివరించారు. జీఓ నంబర్ 31, 39, 01 ప్రకారం బాలల సంరక్షణ కమిటీలను గ్రామ స్థాయిలో ఏ విధంగా ఏర్పాటు చేయాలో వివరించారు. ఆకివీడు ప్రాజెక్టు సీడీపీఓ వాణీ విజయ రత్నం మాట్లాడుతూ బాల్య వివాహాల వలన అన్నీ అనర్థాలేనన్నారు. కార్యక్రమంలో సీఆర్ఏఎఫ్ సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, సూపర్‌వైజర్ పీఆర్ రత్నకుమారి, నాగలక్ష్మి, జి.పార్వతి, సీహెచ్ హేమలత, సూర్యకుమారి, బాలాకుమారి, మేరీ, నిర్మల పాల్గొన్నారు.

ఆరు మద్యం సీసాల స్వాధీనం

ఆకివీడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని గుమ్ములూరు గ్రామంలో మంగళవారం అక్రమంగా ఆరు మద్యం సీసాలతో తిరుగుతున్న పందుల వెంకటరత్నంపై ఆకస్మిక దాడిచేసి, అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు చెప్పారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడిలో ఎస్సై కరుణప్రియ పాల్గొన్నారు.

లింగ వివక్ష, అసమానతలపై అవగాహన

యలమంచిలి: తల్లిదండ్రులు లింగ వివక్ష చూడకుండా అమ్మాయిలను బాగా చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. కిశోర వికాసం ఆరవ రోజు కార్యక్రమం మంగళవారం అడవిపాలెం గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సమావేశంలో హసీనా మాట్లాడుతూ ఆడపిల్లలపై లింగ వివక్ష, అసమానతలు అనే అంశంపై తల్లిదండ్రులకు, 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అలాగే అమ్మాయిలు పౌష్టికాహారం తీసుకోవాలని, యుక్త వయస్సులో ఎలాంటి ప్రలోభాలకు గురికాకూడదని, జీవిత లక్ష్యాల సాధనపై దృష్టి సారించాల వివరించారు. కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు టి.మంజు, పాల్గొన్నారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: స్థానిక మావుళ్లమ్మపేట సచివాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ ఇందిర ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం చేపట్టారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో ఆడపిల్లలపై లింగ వివక్ష గురించి అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులకండం సత్యవేణి మాట్లాడుతూ స్త్రీలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. స్త్రీ విద్యకు ప్రాధాన్యతను ఇవ్వాలని భ్రూణ హత్యలను రూపు మాపాలని సూచించారు. కార్యక్రమంలో అనుష, వి.రాజ్యలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.